క్లుప్తంగా

సీఐగా జి.చంద్రశేఖర్



మక్తల్: పట్టణ సీఐగా జి.చంద్రశేఖర్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు..ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎస్పీ యోగేష్‌గౌతంను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేదు..



నారాయణపేట రూరల్: ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా పనిచేస్తామని ఎస్‌హెచ్‌ఓ ఏ.వెంకటేశ్వర్‌రావు అన్నారు. మహబూబ్‌నగర్ రూరల్ పీఎస్ నుంచి నారాయణపేట టౌన్‌కు బదిలీపై వచ్చిన నూతన ఎస్‌ఐగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నారాయణపేటలో ఎలాంటి సమస్యలు రాకుండా తగిన భద్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భయం లేకుండా ప్రతి ఒక్కరూ పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని, స్నేహపూర్వకంగా ఉంటామని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారికి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఎస్‌ఐకి ఘన సన్మానం



దామరగిద్ద: మండలంలోని పీఎస్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు స్థానంలో ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన వసంతను మండలంలోని కంఢెన్‌పల్లి కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దామరగిద్ద ఎస్‌ఐగా తొలిసారిగా మహిళ ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, భీము, హన్మంతు ముదిరాజ్, అంజియాదవ్, నరేష్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

మండల ఎస్‌ఐగా మురళి

మరికల్: మధనపూర్ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎస్‌ఐ మురళి బుధవారం బదిలీపై వచ్చి మండల ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు మండల ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల విషయంలో డ్రైవర్లు జాగ్రత్త ఉండి డ్రైవింగ్ చేయాలని సూచించారు.

ధన్వాడ: మండల ఎస్‌ఐగా వి.రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పి. రమేష్ బదిలీపై మహబూబ్‌నగర్‌కు వెళ్లగా మహబూబ్‌నగర్ వీఆర్‌లో ఉన్న వీ.రమేష్ ధన్వాడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేస్తానన్నారు.

తాగునీటి ఎద్దడి తీర్చండి

ధన్వాడ: మండల కేంద్రంలోని మారుతినగర్ వీధిలో వారం రోజులుగా తాగునీరు రాక కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ముడు నెలల క్రితం కాలనీకి వచ్చే తాగునీటి పైపులైన్‌ను అధికారులు మార్పులు చేశారు. దీంతో మార్పులు చేసిన నాటి నుంచి నీటి సమస్య వస్తుంది. అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి వివరణ కోరగా సమస్య ఎక్కడ ఉందో తెలియలేదని మిషన్ భగీరథ వారికి తెలియజేశామని వారు వచ్చి పరిశీలిస్తారని తెలిపారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



మక్తల్: పదోతరగతి విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ప్రైవేట్ కళాశాల అధ్యక్షుడ విజేత వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జక్లేర్‌లో పదోతరగతి విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. విద్యార్థులు పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అవసరమని అన్నారు. కార్యక్ర మంలో ఓంప్రకాష్, బాల్‌రాజు, రామ్‌గౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషిచేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని టీపీసీసీ ఎస్టీ సెల్ వైస్ చైర్మన్ రామావత్ శేఖర్, జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ లింగంనాయక్ అన్నారు. పట్టణ ఆదివాసీ గిరిజన చైర్మన్ పాత్లవత్ రవి నాయక్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఆదివాసీ గిరిజన విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం పట్టణ ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్లుగా రఘువీర్‌సింగ్, హరినాయక్, కన్వీనర్‌గా పి.తిరుపతినాయక్, కోకన్వీనర్‌గా రవినాయక్, ఈసీ సభ్యులుగా అరుణ్ నాయక్, రాంచందర్‌లను నియమించారు.

ఆటోవాలా అవస్థలు

- మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో తగ్గిన ప్యాసింజర్లు
- తగ్గిన ఆటో డ్రైవర్ల ఆదాయం
- గంటల తరబడి లైన్‌లో ఉన్న ఆటో ఎక్కని ప్రయాణికులు
- ఆర్థిక ఇబ్బందుల్లో ఆటో డ్రైవర్లు



యానగుందిలో నారాయణపేటకు తోలేందుకు నిలిపిన ఆటోలు (ఫైల్)

దామరగిద్ద: మహిళ ప్యాసింజర్‌లే వారి ఆటో ప్రయాణానికి ప్రధాన ఆధారం. ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణంతో ఆటోలో ప్రయాణించే వారి సంఖ్య భారీగా తగ్గింది. దీంతో ఆటో తోలే డ్రైవర్ల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ఆటోలు నడుపుతూ జీవనం సాగించే వందలాది మంది ఆటో నిర్వాహకులు తమ కుటుంబాన్ని పోషించలేక పోతున్న దుస్థితి నెలకొంది. కేవలం ఆర్టీసీ బస్సుసౌకర్యం లేని గ్రామాల్లోని ఆటోలకు సైతం ప్రధాన రహదారిల వరకే ఆటోలు ఎక్కి మిగితా ప్రయాణాన్ని ఆర్టీసీ బస్సుల్లో కొనసాగిస్తున్నారు. ఏడాదికి 12వేలు ఇస్తామంటు ప్రభుత్వం ఉపసమనం కల్పిస్తున్న రోజుకు రూ. 500 నుంచి వెయ్యి రూపాయలు సంపాదించుకునే తమకు ప్రభుత్వం ఏడాదికి రూ. 12వేలు ఇచ్చిన ఆటో మెంటేనెన్స్‌కు సరిపోవని వాపోతున్నారు.

మండలంలో ఇలా..

మండలంలోని ప్రధానంగా షటిల్ బస్సులు మాత్రం తిరిగే రూట్‌లు అయిన వితలపూర్, గత్ప, యానుగుంది, కాన్‌కుర్తి, ఉడ్మల్‌గిద్ద, మొగుల్‌మడ్క లోకూర్తి ఉల్లిగుండం, పిడెంపల్లి, కందెన్‌పల్లి వంటి మారుమూల గ్రామాల్లో ఆటోలపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలున్నాయి. ఉడ్మల్‌గిద్దలో 30మంది ఆటోలను తోలుతు జీవనం సాగిస్తుండగా కాన్‌కుర్తిలో 20మంది ఆటో నిర్వాహకులున్నారు. గడిమున్కన్‌పల్లిలో 20మంది, దామరగిద్దలో 10మంది లోకూర్తి, నర్సాపూర్ మల్‌రెడ్డిపల్లి తదితర గ్రామాల్లోనే ప్రతి గ్రామానికి 10 నుంచి 15ఆటోలు ఉన్నాయి. నిత్యం వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లు తమ ఆటోల్లో మహిళ ప్రయాణికులు తగ్గడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆటో నిర్వాహకులను దృష్టిలో ఉంచుకొని ఆర్థిక సహకారం అందించాలని కోరుతున్నారు.

మూడు ట్రిప్‌లు తిప్పేవాళ్లం..



గత 18ఏళ్లుగా ఆటోనే జీవనాధారంగా జీవిస్తున్న, ఆర్టీసీ షిటిల్ బస్సులు తిరుగుతున్న కూడా యానుగుంది నుంచి నారాయణపేట వరకు 3ట్రిప్‌లు తోలేవాళ్లం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఇప్పుడు రోజంతా లైన్‌లో ఉన్న ఒక్క ట్రిప్ కూడా దొరకడం లేదు. ఆదాయం పూర్తిగా తగ్గింది.

- నర్సింహ,
ఆటో డ్రైవర్, కాన్‌కుర్తి

ఆటోఫైనాన్స్ కట్టలేకపోతున్నాం



తాను 2008నుంచి ఆటో నడుపుతు బతుకుతున్నా, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినప్పటి నుంచి ఆటోల్లో ఎక్కేవారు తగ్గింద్రు. ఆటో నడుపుతు ఆటోఫైనాన్స్ డబ్బులు సైతం కట్ట లేకపోతున్నాం. ప్రభుత్వం ఆటో నిర్వాహకులపై ప్రత్యేకదృష్టి పెట్టి తమకు న్యాయం చేయాలి.

- వెంకటప్ప,
ఆటో డ్రైవర్, కాన్‌కుర్తి

ఇల్లు గడవటం లేదు..



ఆటోల గిరాకి దగ్గింది. రోజుకు నాల్గు ట్రిప్‌లు తిప్పేవాళ్లం. ఒక్క ట్రిప్ కూడా దొరకడం లేదు. డిజిల్ ఖర్చులు ఎల్లని పరిస్థితి నెలకొంది. పొద్దంతా ప్రయాణికుల కోసం ఎదురుచూసి ఒకటి రెండు ట్రిప్‌లతో సరిపెట్టుకొని ఇంటికెళ్తున్నాం. ఇంటి ఖర్చులు ఎల్లక ఇల్లు గడవటం కష్టంగా మారింది.

- సాబప్ప, ఆటో డ్రైవర్, కాన్‌కుర్తి

పంటల సాగు వివరాలు నమోదు



పంటలను నమోదుచేస్తున్న ఏఈఓ

కోస్గి:రైతులు సాగుచేసిన పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తున్నామని, రైతులు వ్యవసాయశాఖ అధికారులకు తమ పంటల వివరాలు అందజేయాలని ఏఈఓ తిరుపతయ్య సూచించారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని ముక్తిపాడ్‌లో రైతుల పొలాలను పరిశీలించి యాసంగిలో సాగుచేసిన వరిపంట వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించే పంటల సాగు వివరాలను ప్రామాణికంగా తీసుకొంటుందని, రైతులు విధిగా తమ పంటలను నమోదుచేసుకోవాలని సూచించారు. రైతులు బాలప్ప, కిష్టప్ప, హన్మంతుతోపాటు పలువురు ఉన్నారు.

జములమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



మక్తల్: పట్టణంలో జములమ్మ ఆలయ పునః నిర్మాణంలో బుధవారం భాగంగా ఆలయంలో గోమాతను తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మక్తల్‌కు చెందిన మనసాని రత్నమ్మ నర్సింహగుప్తా జ్ఞాపకార్థంకోసం దాత మనసాని వెంకటేష్‌సరళ తమ సొంత ఖర్చులతో ఆలయ నిర్మాణం చేపట్టారు. రెండు రోజులు ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టనున్నారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మనసాని వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు మనసాని కిరణ్ ప్రత్యూష, వేదపండితులు శ్యాంసుందర్, వంశీకృష్ణ, విజయేంద్ర, కార్తిక, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు వీడ్కోలు సన్మానం



నర్వలో కల్వాల్ సర్పంచు దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు



మరికల్‌లో సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న కార్యదర్శి

నర్వ: నేటితో రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుండడంతో బుధవారం కల్వాల్ పాలకవర్గానికి గ్రామస్తులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్వరమ్మ, ఉప సర్పంచ్ అంపయ్య, వార్డు సభ్యులను శాలువాతో సన్మానించారు. గ్రామాభివృద్ధి కోసం పాలకవర్గం చేపట్టిన పనులను ఈ సందర్భంగా గ్రామస్తులు గుర్తుచేసుకోని అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి లోకేష్, చిన్న య్య, దండు అయ్యప్ప, డా.శంకర్, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మరికల్: నేటితో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుండడంతో బుధవారం గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులను పంచాయతీ కార్యాలయ ఆవరణలో కార్యదర్శి కవిత సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ సహకారంతో తమ గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

ఊట్కూర్ మీదుగా బస్సు నడిపించాలి

ఊట్కూరు: నారాయణపేట నుంచి ఊట్కూరు, పులిమామిడి మీదుగా బస్సును నడిపించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ మహేష్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గత ఏడాది క్రితం ఊట్కూరు, బిజ్వార్, పులిమామిడి, జక్లేర్ మీదుగా హైదరాబాద్‌కు బస్సు వెళ్లేదని, బస్సుల కొరతతో అధికారులు బస్సును నిలిపివేశారని తెలిపారు. దీంతో వివిధ గ్రామాల నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్సును నడిపించాలని కోరారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం



ప్రజాప్రతినిధులతో కలిసి అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

కోస్గి(మద్దూరు): కొతపల్లి మండలంలోని నిడ్జింతలో పలు అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డితో కలిసి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి బుధవారం ప్రారంభించారు. గ్రామ శివారులోని వెంకటేశ్వర ఆలయం వద్ద పల్లె ప్రకృతి వనం, గ్రామంలోని ఉపాధినిధులతో నిర్మించిన పంచాయతీ భవనం, స్మశాన వాటిక, మనఊరు–మనబడి కార్యక్రమంలో మంజూరైన పాఠశాల అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ సారథ్యంలో గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, వైస్‌ఎంపీపీ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ లావణ్యారాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ కాంతారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నరేందర్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మరికల్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు ఆంజనేయులు, గోవర్ధన్ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం పాఠశాల ఆవరణలో ఒకే దగ్గర మరుగుదొడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారని, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అప్పులు చేసి పనులు పూర్తి చేశారన్నారు. ఏళ్లు గడుస్తున్నా నేటికి బిల్లులు రాకపోవడంతో వడ్డీలు కట్టలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.

శాంతి కోసం ప్రార్థించాలి

ఆత్మకూర్: ఉమ్రహ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులు ప్రపంచ శాంతి, సర్వమానవాళి కోసం ప్రార్థించాలని పలువురు సూచించారు. బుధవారం ఆత్మకూర్ నుంచి ఉమ్రహ్ యాత్రకు బయలుదేరిన చాంద్‌పాషకు బాల్యమిత్రులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దివాన్జీ ప్రభాకర్‌రావు, సంతోష్‌కుమార్, దివాన్జీ అశోక్‌కుమార్, నాగరాజు, సైదోద్దీన్ ఉన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..



అమరచింత కొత్తతండా సమీపంలో రహదారి పక్కన గుంత

అమరచింత: మండల కేంద్రం నుంచి మద్దూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన బీటీ రహదారి పక్కన కేబుల్ లైన్ కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా తయారయ్యింది. రహదారిపై ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులతో పాటు ఇతర వాహనదారులు ఆదమరిచి ఉంటే గుంతలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. జియో ఇంటర్నెట్ లైన్ కోసం రహదారి పక్కన ఏర్పాటు చేసుకున్న కేబుల్ లైన్‌కు మధ్యమధ్యలో ఇలా గుంతలను తవ్వి వాటిని పూడ్చకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయందోళనలు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి వాటిని పూడ్చివేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెకుముఖి పోటీలో విద్యార్థుల ప్రతిభ

మక్తల్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన చెకుముఖి పోటీలో కేరళ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అనంతరం మండలస్థాయి పోటీల్లో గెలుపొందిన వారికి జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాల జెహెచ్‌ఎం అనిల్‌గౌడ్ బహుమతులు అందజేశారు. కేరళ పాఠశాల కరస్పాండెంట్ మీరా, ప్రిన్సిపాల్ జార్జ్‌జోషఫ్ అభినందించారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



నారాయణపేట మండలం కొల్లంపల్లిలో మాట్లాడుతున్న కన్యాకుమారి



ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

నారాయణపేట రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకుని ఉండాలని అధికారులు అన్నారు. ప్రతి నెల ఆఖరిరోజు జిల్లాలో సివిల్‌రైట్స్ డే నిర్వహించాలనే ఆదేశాలతో జిల్లాలోని ప్రతి పీఎస్ పరిధిలో ఒక గ్రామం ఎంపిక చేసి బుధవారం కార్యక్రమం చేపట్టారు. ఈమేరకు పోలీసులు ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల అధికారులు, సంబంధిత పీఎస్‌ల ఎస్‌ఐ, ఏఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛగా జీవించే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. బీద, ధనిక తేడా లేకుండా అందరు సమానంగా సేవలను పొందవచ్చని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి

మాగనూర్: పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఓబ్లాపూర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ శ్రీశైలం మాట్లాడుతూ... పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఉండాలని, సోదరభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీశైలం, ఏఎస్‌ఐ మన్నన్, కానిస్టేబుల్ రాజశేఖర్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రభుత్వ భూముల గుర్తింపు



హద్దులు గుర్తిస్తున్న సర్వే, రెవెన్యూ అధికారులు

కోస్గి: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూముల గుర్తింపు పనులను నిర్వహించారు. పలు అభివృద్ధి పనుల నిమిత్తం అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించాలని రాష్ట్ర అధికారులు సూచించిన నేపథ్యంలో పలు గ్రామాల్లో సర్వే చేసి ప్రభుత్వ భూముల్ని గుర్తిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని ఎర్రకుంటకు సంబంధించి సర్వే నంబర్ 1808, 1809, 1811, 1812లో ఉన్న భూములకు హద్దులు గుర్తిస్తున్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ అరుణ, ఆర్‌ఐ హర్షవర్ధన్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ ఆనంద్ కిషోర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోస్గి: రజక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ నాయకులు, రజక సంఘం ప్రతినిధులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై పార్టీ నాయకులతో సమీక్షించారు. అలాగే దళిత బహుజన శ్రామిక యూనియన్ నూతన క్యాలెండర్‌ను తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐ జనార్దన్, ఎస్సై శ్రీనివాసులు వేర్వేరుగా ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు వార్ల విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు ఇద్రీస్, భానునాయక్, అన్న కిష్టప్ప, విద్యాసాగర్, గిరిప్రసాద్, సంఘం ప్రతినిధులు చిన్నయ్య, కృష్ణ, చిన్నికృష్ణ, భరత్‌తో పాటు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

ఊట్కూరు: కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం మండలంలో చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని మండల ధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు కొక్కులింగం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని పెద్దజట్రం, అవుసలోనిపల్లి, బిజ్వార్, పులిమామిడి తదితర గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగుతుందని ఈ పాదయాత్రను సీడబ్ల్యూసీ సభ్యులు డాక్టర్ చల్లా వంశీచందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొంటారని తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మక్తల్ నుంచి పాదయాత్ర..

మక్తల్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. అనంతరం పట్టణంలోని యాదవనగర్, గోపాలస్వామి గుడి, మారుతినగర్, పాతబజార్, అంబేద్కర్‌చౌక్ కాలనీ మీదుగా పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ దేవర్లు



అమ్మవారికి సమర్పించే పొటేళ్లతో కురువలు



బంగారు చల్లుకుంటున్న భక్తులు

అమరచింత: డిల్లంపల్లం అంటూ కుర్వ డోళ్ల వాయిద్యాల మధ్య బోనం కుండలతో ఊరేగింపులు, మహిళలు ఏల్లంద్యావర్లలో పూనకంతో జోకలే.. జోకా అంటూ అనే నినాదాలతో పాంరెడ్డిపల్లి పులకించింది. ఐదేళ్లకో పర్యాయం కురువలు నిర్వహించే ఎల్లమ్మ దేవర్ల ఉత్సవాలు మండలంలోని పాంరెడ్డిపల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన కురువలు బంధువులతో బండారు ప్రాంగణం కిక్కిరిసి పోయింది. పోటేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తలపై బండారు(పసుపు) చల్లుకుని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి



సమ్మె నోటీస్‌ను అందిస్తున్న కార్మిక సంఘం నాయకులు

అమరచింత: ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు మున్సిపల్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సమ్మె నోటీస్‌ను అందించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎస్ రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏరియల్స్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేల ఇవ్వాలనే డిమాండ్లతో సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రభాకర్, ప్రేమ్‌కుమార్, హరికృష్ణ, సునీల్, రవీందర్, చిన్న, తిప్పన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయండి

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఏకలవ్య కాలనీలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని నాయకులు కోరారు. జిల్లా ఏకలవ్య ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో కనీస సౌకర్యాలైన తాగునీరు, కరెంట్ స్తంభాలు, వీధిలైట్లు, డ్రైయినేజీలు వంటివి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని సంఘం అధ్యక్షుడు రాగిరి నర్సిములు, ప్రధాన కార్యదర్శి సుక్కన్న తెలిపారు.